## క్లుప్తంగా

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

**ఇంద్రవెల్లి:** ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని లాల్‌టెకిడి గ్రామంలో అంజనేయ అభిషేక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లాల్‌టెడికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, శ్రీకాంత్ మహరాజ్, ఆరెల్లి రాజలింగు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, దీలిప్ మోరే, మస్కే రాజువర్ధన్, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

### 'మైనార్టీ వ్యతిరేకులను పార్టీలో చేర్చుకోవద్దు'

**ఎదులాపురం:** మైనార్టీలకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎంపీ సోయం బాపురావును ఏ విధంగా పార్టీలో చేర్చుకుంటారని కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ కలీం జాతీయ నాయకత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన కంది శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరిన వెంటనే టిక్కెట్ అడగడం ఏంటని మండిపడ్డారు. పారాషూట్ లీడర్లకు టిక్కెట్ ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్ (అన్ను), రసూల్, హలీం, మునీర్, మీర్జా ఇమ్రాన్ బేగ్, ఇమ్రాన్ ఖాన్, రిజ్వాన్, సయ్యద్ సాబీర్ పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**నేరడిగొండ:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

**ఇచ్చోడ:** ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొదించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌ఆర్పీ బైరి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని అడెగామ(బి), ఇస్లాంనగర్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, భువనేశ్వరి పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**తాంసి:** పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో నర్సమ్మ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని కరంజి (టి) ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాత్విక, సూపర్ వైజర్ ముంతాజ్ బేగం, అంగన్‌వాడీ శోభ, వినిత పాల్గొన్నారు.

### స్వచ్ఛతపై అవగాహన

**ఉట్నూర్‌రూరల్:** మండలంలోని ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతపై ఎంపీపీ జైవంత్‌రావు అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

### 'కుమురం సూరు వర్ధంతి నిర్వహించాలి'

**ఆదిలాబాద్‌రూరల్:** కుమురం సూరు వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమురం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో కుమురం సూరు విగ్రహన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొలాం గ్రామాల్లో వసతులు కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఐటీడీఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం భీంరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు టేకం వినాయక్, కొదప విజయకుమార్, ఆత్రం మాణిక్‌రావు, ఆత్రం శ్రీను పాల్గొన్నారు.

### దుకాణదారుడిపై దాడి

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తిపై కొందరు మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ మసీదు ప్రాంతంలోని షాపులోకి ఒక్కసారిగా చొచ్చుకువచ్చి దుకాణాదారుడు సాజిద్‌పై దాడికి పాల్పడ్డారు. గాయపడిన సాజిద్‌ను వెంటనే రిమ్స్‌కి తరలించారు. వ్యాపార లావాదేవీలే దాడికి కారణమని తెలుస్తోంది. ఈ విషయమై డీఎస్పీని ఉమేందర్‌ను వివరణ కోరగా.. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సాజిద్‌కు సంబంధించిన కొందరు దాడికి పాల్పడిన వారికి ఫోన్ చేసి చంపుతామని బెదిరించడంతో ఆయన సైతం టుటౌన్‌లో ఫిర్యాదు చేరారని డీఎస్పీ తెలిపారు.

# డీజే.. దడ!

- నిమజ్జన వేళ పరేషాన్
- హృద్రోగుల గగ్గోలు
- ముందు జాగ్రత్తగా ఇతర ప్రాంతాలకు
- అనుమతి లేదంటున్న పోలీసులు
- నేడు పలు మండలాల్లో గణేశ్ నిమజ్జనం

– బోథ్ మండలకేంద్రంలోని ఓ కాలనీలో దాదాపు 10 మంది వరకు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఓ రిటైర్డ్ ఉద్యోగికి గతంలో గుండె శస్త్ర చికిత్స కాగా, గతేడాది గణేశ్ నిమజ్జన సమయంలో డీజే సౌండ్‌తో తీవ్ర ఇబ్బందికి గురయ్యాడు. ఈ ఏడాదిగాను నేడు బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల్లో గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి కూడా స్థానికంగా డీజే వినియోగిస్తున్నట్లు తెలియడంతో చేసేది లేక శుక్రవారం నిర్మల్‌లోని తన బంధువుల ఇంటికి బయలుదేరాడు.

– కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రెడ్డిపేటలో నరేశ్ అనే యువకుడు బుధవారం నిర్వహించిన గణేశ్ నిమజ్జనంతో డీజే సౌండ్‌తో గుండెపోటు వచ్చి చనిపోయాడు.

– బోథ్ మండలకేంద్రంలో బుధవారం డీజే సౌండ్‌తో ఓ యువకుడికి ఛాతిలో తీవ్రనొప్పి వచ్చింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అధిక సౌండ్‌తోనే ఛాతిభాగంలో నొప్పి వచ్చిందని వైద్యులు చెప్పడం గమనార్హం.



**బోథ్:** గణేశ్ నిమజ్జనం అంటే గతంలో డప్పుచప్పుళ్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. యువత డీజేకే మొగ్గు చూపుతున్నారు. అధిక సౌండ్ వారిలో జోష్ నింపుతుండగా.. గంటల పాటు తీన్మార్ స్టెప్పులతో హోరెత్తిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. గుండె సంబంధిత సమస్యలున్న వారికి మాత్రం ఈ డీజేతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా నిమజ్జనం రోజున హృద్రోగుల్లో గుబులు రేపుతోంది. ఇటీవల పలుచోట్ల యువకులు సైతం గుండెనొప్పికి గురై ప్రాణాలు వదలడం గమనార్హం.

**సుప్రీం ఆదేశాలు బేఖాతరు..**

డీజే వాడొద్దని సుప్రీంకోర్టు సైతం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయినా వీటిని పట్టించుకోవడం లేదు. గతంలో పట్టణాలకే పరిమితమైన ఈ డీజే ప్రస్తుతం గ్రామాల్లోనూ వినియోగిస్తున్నారు. గణేశ్ నిమజ్జనం రోజున ఎలాంటి సమస్యలు రాకూడదని, సంఘటనలు చోటు చేసుకోకూడదని పోలీసులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయా మండపాల నిర్వాహకులు నిమజ్జనంలో వీటిని వినియోగిస్తున్నారు.

#### అధిక శబ్దం వల్ల ఇబ్బంది



మా నాన్నకు గతంలో గుండె ఆపరేషన్ అయింది. గణేశ్ నిమజ్జనం రోజున డీజేతో గతేడాది చాలా ఇబ్బందైంది. ఈసారి నిర్మల్‌లోని మా బంధువుల ఇంటికి పంపిస్తున్నాం. మా కాలనీలో చాలా మంది గుండె సమస్యలున్నవారు ఉన్నారు. వారంతా ఆందోళన చెందుతున్నారు.
– తూము సూర్యం, బోథ్

#### డీజేలకు అనుమతి లేదు



డీజేలకు ఎలాంటి అనుమతి లేదు. డీజే శబ్ధం వల్ల వృద్ధులు, చిన్న పిల్లలకు ప్రమాదం. గుండె జబ్బులు ఉన్నవారికి ఇబ్బంది అవుతుంది. పరిమిత స్పీకర్లకు మాత్రమే అనుమతినిచ్చాం.
ఉమేందర్, డీఎస్పీ, ఆదిలాబాద్

#### గుండె బలహీనపడుతుంది



శబ్దం వల్ల గుండె బలహీనపడుతుంది. శబ్ద తరంగాలు అధికమైతే గుండెపై ప్రభావం పడుతుంది. బీపీ ఎక్కువ అవుతుంది. దీనివల్ల గుండెపోటుతో పాటు బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. వారిని డీజే సౌండ్‌కు దూరంగా ఉంచడం మంచిది.
– విద్యాసాగర్, ఎండీ, డీఎం, కార్డియాలజిస్ట్, ఆదిత్య ఆసుపత్రి, నిర్మల్

#### నిషేధించాలి



డీజేతో గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. దీనిని నిషేధిస్తూ సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. అయినా సరే చాలాచోట్ల వినియోగిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా డీజే నిషేధించాలి.
– సూర్యప్రకాశ్‌రెడ్డి, బోథ్

## 'కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు'

**నేరడిగొండ:** కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను నమ్మి మోసపోవద్దని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుప్టి గ్రామంలో శుక్రవారం శ్రీరామ సేవా సమితి సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీటీసీ ఓర్స సవిత, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, అల్లూరి శివారెడ్డి, నారాయణ రెడ్డి, తాహెర్‌బిన్ సలీమ్, చంద్రశేఖర్ యాదవ్, గులాబ్ సింగ్, కమలాకర్ రెడ్డి, ప్రతాప్ సింగ్, కుంట కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు**

**ఇచ్చోడ/ నేరడిగొండ:** ఇచ్చోడ మండల కేంద్రంలో శుక్రవారం బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై వడ్డించారు.



అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

## ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

**నార్నూర్:** ఏజెన్సీలో 1/70 పెసా గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో రాయిసెంటర్ సార్‌మేడిలు, గ్రామ పటేల్‌లు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ జాడి రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు మాట్లాడుతూ.. గిరిజన చట్టాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ చట్టాలకు నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుంరా జైతు, పూసం ఈశ్రు, సిడాం జంగు, కె. మారు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఈవీఎంలను బ్యాన్ చేయాలి

**ఇంద్రవెల్లి:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను బ్యాన్ చేసి బ్యాలెట్ ద్వారా ఎన్నికలను నిర్వహించాలని బహుజన జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు మునేశ్వర్ బుద్ధరతన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, ఈవీఎం కరపత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో బహుజన జాగృతి సేన సభ్యులు అఖిల్, ఓం శ్రీ,రాజు, దివ్య, రోహిత్, అనురాగ్, పాయల్, తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## మండలాల్లో భారీ వర్షం

**బజార్‌హత్నూర్:** మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని మొర్కండి, చింతలసాంగ్వి, చందునాయక్ తండా, కొలారి, సుంగుగూడ, టెంబి గ్రామాల లోలెవెల్ వంతెనలపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

**నేరడిగొండ:** మండలంలోని తర్నం గ్రామస్తులు శుక్రవారం కురిసిన వర్షానికి ఇబ్బంది పడ్డారు. కడెం పరివాక ప్రాంతానికి ఆనుకొని ఉన్న తర్నం గ్రామంతో పాటు కుప్టి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



వంతెన దాటేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

**సిరికొండ:** మండల కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వ్యాపారస్తులు, ప్రజలు ఆందోళన చెందారు. పత్తి కాత నేలరాలుతుందని, రైతులు ఆందోళన చెందుతున్నారు.

## వైద్య శిబిరం

**తాంసి:** తాంసి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నరేందర్, సుజాత, ఏఎన్ఎం సువర్ణ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**కుక్కర్ల పంపిణీ**

**కైలాస్‌నగర్:** కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి తన కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కుక్కర్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని రాంనగర్ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మహిళలకు కుక్కర్లు అందజేశారు.

**గొడుగుల పంపిణీ**

**ఉట్నూర్‌రూరల్:** మండల కేంద్రంలోని చిరు వ్యాపారస్తులకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. ఎంపీపీ జైవంత్ రావు, మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పేదలకు ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు రషీద్, ధరణి రాజేశ్, సీతారాం, స్వామి, కాటం రమేశ్, షౌకత్ అలీ, ముజీబ్ ఖాన్, ఆశన్న, అనుదీప్, రవీందర్, సోనేరావు పాల్గొన్నారు.

**జంతువులపై ప్రేమతో మెలగాలి**

**బోథ్:** ప్రతిఒక్కరూ జంతువుల పట్ల ప్రేమగా మెలగాలని టీఎస్ఆర్‌డబ్ల్యూఎస్ వైస్ ప్రిన్సి పాల్ రవికుమార్ అన్నారు. జంతు ప్రేమికుడు లక్ష్మన్ రాసిన దజర్ని ఆఫ్ బంటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ప్రతిభ**

**ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా రెసిడెన్షియల్ క్రీడా పోటీల్లో సత్తాచాటారు. విద్యార్థులతో పాటు పీఈటీ రాకేష్, జ్యోతిశ్వరన్లను ప్రిన్సిపాల్ రంగన్న అభినందించారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వార్డెన్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

**యువతి అదృశ్యం**

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాగాపూర్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వాగాపూర్ గ్రామానికి చెందిన బాలే గంగన్న కూతురు గురువారం కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. శుక్రవారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**అనాథ శవానికి అంత్యక్రియలు**

**ఆదిలాబాద్‌టౌన్:** మానవసేవే మాధవ సేవా సమితి, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి శ్మశాన వాటికలో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాదవార్ శ్రీనివాస్, చౌహాన్ శశికళ, ఎస్‌బీ పోలీస్ కానిస్టేబుల్ చిందం దేవిదాస్, అజీజ్, పాలకొండ శ్రీకాంత్, నాగరాజ్, దమ్మకీర్తి, నైతం సుఖలాల్ పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**ఇచ్చోడ:** మండల కేంద్రంలో శుక్రవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్డికాలనీ, ఎస్సీకాలనీ, నవయుగ కాలనీ, మజీద్ గల్లీ, సోనర్‌గల్లి, బజార్‌రోడ్డు, శివాజీ చౌక్‌ల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మకుంటలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణనాథుల శోభాయాత్ర శనివారం ఉదయం వరకు కొనసాగనుంది. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నృత్యం చేస్తున్న యువతులు

## విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు, ధూమపానానికి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పొగాకు రహిత విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని గెజిటెడ్ నం.1, ప్రైమరీ స్కూల్, రిజర్వ్‌డ్ పోలీస్‌లైన్ ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి శిశు మందిర్ వినాయక్ చౌక్, న్యూ హౌసింగ్ బోర్డ్ పాఠశాలలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించారు. పాఠశాలలకు వంద గజాల పరిధిలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, సెక్టోరియల్ ఆఫీసర్ సుజాత ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, మల్లయ్య, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు

## 60 వేల ఎకరాలకు సాగు నీరు



పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

**జైనథ్:** కోర్ట– చనాఖా బ్యారేజీ ద్వారా ఆదిలాబాద్ నియోజకవర్గంలో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా.. హట్టిఘాట్ పంప్‌హౌజ్ పనులు పూర్తయినట్లు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. శుక్రవారం జైనథ్ మండలం హట్టిఘాట్ పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. ఇటీవల పంప్‌హౌజ్‌లో 5.5 మెగావాట్ల మోటర్ డ్రై రన్, వెట్ రన్‌ను అధికారులు విజయవంతంగా పూర్తి చేయడంతో వారికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే జోగు రామన్న పట్టుదల, కృషితోనే ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతుందన్నారు. త్వరలోనే బ్యారేజీ ద్వారా పంటలకు నీరందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట డీఈ మనోహర్, గోస్కుల మహేష్, ఇబ్రహీం, జేఈలు ఉన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**తాంసి:** అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ అన్నారు. మేరా మిట్టి.. మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పొన్నారి గ్రామంలో మట్టి సేకరణ కార్యక్రమాన్ని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ దాసరి నవీన్ విగ్రహం నుంచి మట్టిని సేకరించారు. అనంతరం నవీన్ కుటుంబసభ్యులను సన్మానించారు. ఢిల్లీలో అమరుల స్మారకార్థం నిర్మించే కట్టడానికి మట్టిని సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ అధికారి పుష్పేంద్ర కుమార్, సిబ్బంది అంజురాయి, పోస్ట్‌మాన్ తేజస్వి, సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రేఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బోథ్:** స్వాతంత్ర్య పోరాటంలో అమరుల త్యాగాలు మరువలేనివని పోస్టల్ ఎస్పీఎం అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న రావుల బుచ్చన్న సతీమణి సుభద్ర, యాల్ల ప్రమీలను సన్మానించారు. స్మృతి వనానికి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో అధికారులు పుష్పేందర్, మునీర్, వెండి సోమేశ్వర్, ఓరుగంటి స్వామి, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.




పొన్నారిలో మట్టిని సేకరిస్తున్న పోస్టల్ అధికారి

## పారితోషికం వద్దు.. వేతనం ముద్దు



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

**ఇంద్రవెల్లి:** పారితోషికం వద్దు.. వేతనం ముద్దు అంటూ.. ఆశవర్కర్లు ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం ఆశ కార్యకర్తలు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు కాంతాబాయి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద భీమా కల్పించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం సభ్యులు కనక తుల్సిబాయి, వనమాల, సుమిత్ర, ఊర్మిళ, రుషాలి, సువర్ణ, సునీత పాల్గొన్నారు.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి

**నేరడిగొండ:** సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు కృషి చేస్తున్నట్లు సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో సమావేశం నిర్వహించారు. జమ ఖర్చుల ఆమోదం, దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు, వసూలు చేయడం, తదితర అంశాలపై చర్చించారు. సంఘ ప్రగతి నివేదికను సీఈవో బారె నాగభూషణ్ చదివి వినిపించారు. పలు అంశాలపై సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వెంకట రమణ, కోశాధికారి కొట్టాల మోహన్, డైరెక్టర్లు అనుపట్ల సంజీవ్ కుమార్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ప్రగతి నివేదిక చదువుతున్న సీఈవో

## అంగన్‌వాడీల భిక్షాటన



తాంసి: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

**తాంసి:** తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు వినూత్న నిరసన తెలిపారు. శుక్రవారం దుకాణాల్లో, వాణిజ్య సముదాయాల్లో భిక్షాటన చేశారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు వెంకటమ్మ, సరితా, దేవత, భాగీర్థ, వితబాయి, రూప, తదితరులు పాల్గొన్నారు.

**నార్నూర్:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయంతో పాటు మార్కెట్‌లో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నాయకురాలు పంచశీల, పంచపూల, కవిత, సంగీత మల్లు పాల్గొన్నారు.

**ఇంద్రవెల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు సుభద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై చిన్న చూపు చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఆత్రం నాగుబాయి, పెంటుబాయి, సులోచన, అనసూయ, నందా, అనిత, కమలాబాయి పాల్గొన్నారు.